క్లుప్తంగా

త్రికోటేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటీశ్వర స్వామి వారిని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యేకు అర్చకస్వాములు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడారు. ఆలయంలో భక్తులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

వేర్వేరు అంశాలపై సభ్యుల చర్చ



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ జయశ్రీ వెంకటరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజాప్రతినిధులు తెలియజేసిన సమస్యలను అధికారులు గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పంటసాగుదారు హక్కు పత్రాలు మంజూరు చేయాలి



వినుకొండ (నూజెండ్ల): సాగు చేసే రైతులందరికీ పంటసాగుదారు హక్కు పత్రాలను త్వరితగతిన మంజూరు చేయాలని మండల తహసీల్దార్ జి. రమేష్ కుమార్ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బందికి సమీక్ష నిర్వహించారు. సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన వివరించారు. ఏవో షేక్ సుగుణాబేగం మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డుల వల్ల రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు రాయితీపై పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీటీ అర్జున్ నాయక్, ఏఈవో ఎలీషా, వీఆర్వోలు, వీఏఏలు, వీహెచ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీ, ఊసావారివీధి, భగత్‌సింగ్ రోడ్డు, ముదిరాజ్ కల్యాణ మండప ప్రాంతం, పుట్టావారివీధి పరిసర ప్రాంతాల్లో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాదెండ్ల: సాతులూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. సాతులూరు, చందవరం, దొండపాడు, పానుగుపాడు, డెయిరీ ఇండస్ట్రీస్, సాతులూరు ఇండస్ట్రీస్‌కు విద్యుత్‌సరఫరా నిలిచిపోతుందన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం టాటాబిల్డింగ్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. భవిష్యత్‌లో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగణ్య దేశాల్లో తొలి మూడుస్థానాల్లో ఉండేలా స్మార్ట్ ఇండియా అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. పోటీల్లో 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా టాటా గ్రూపు ప్రతినిధి ఆనంద్ హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేశారు. సీనియర్స్ విభాగంలో లక్ష్మీ ప్రసన్న, ఎం.తులసి, కె.అమూల్య, జూనియర్స్ విభాగంలో రమ్యశ్రీ, కె హిమాదిత్య, కె.అనూషతో పాటూ మరికొందరికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణానాయక్, సోషల్ ఉపాధ్యాయుడు నక్కా బాజిబాబు, కె.కె.ఆర్, ఇన్‌చార్జి హెచ్ఎం ఉషారాణి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలి

నరసరావుపేట టౌన్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. ఆశీర్వాదం పాల్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం యలమంద ఎంపీపీఎస్ పాఠశాల నందు శ్రీనివాస గిరిజన కాలనీ వాసులకు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ జె. ప్రసాద్ పాల్గొని వైద్యసేవలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు.

మౌలిక వసతుల కల్పనలో కీలకపాత్ర మీదే

- శావల్యాపురం ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.సుగుణ
- వేర్వేరు ప్రాంతాల్లో పంచాయతీల అభివృద్ధిపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు



బొల్లాపల్లిలో శిక్షణకు హాజరైన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు

శావల్యాపురం: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు కీలకపాత్ర పోషించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో పి.సుగుణ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల్లో శానిటేషన్, వీధిలైట్లు, మౌలిక వసతులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకుని పంచాయతీలకు అదనపు ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ వాణి, ఏపీవో రామారావులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో....

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభానికి ముందుగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శిక్షణను ఈవోపీఆర్‌డీ షేక్ జిలానీబాషా ప్రారంభించి మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. శిక్షకులుగా పలుకూరు, పేరూరుపాడు పంచాయతీ కార్యదర్శులు టి. శ్యామలాదేవి, ఏపీ పాండురంగారావులు వ్యవహరించారు. శిక్షణలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామసర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల రీ ఫ్రెషర్ ట్రైనింగ్ క్లాసులు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు సోమవారం జరిగిన శిక్షణలో ఎంపీడీవో డి.నరసయ్య పాల్గొని మాట్లాడుతూ కార్యదర్శులు, సర్పంచ్‌ల విధులు, నిధులు గురించి, అధికారాల గురించి తప్పనిసరిగా తెలుసుకొని ఉండాలని తెలిపారు. గ్రామాల్లో గ్రామసభల నిర్వహించి గ్రామాభివృద్ధికి తోడ్పడేలా చూడాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ మోహన్ చంద్, ట్రైనర్ ఉదయ కుమార్, 26 గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు , అధికారులు పాల్గొన్నారు.



శావల్యాపురంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుగుణ



వినుకొండలో మాట్లాడుతున్న ఎంపీడీవో నరసయ్య

రొంపిచర్లలో...

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ, జీపీడీపీ, ఎస్‌డబ్ల్యూఎం అంశాలపై మూడురోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాలను ఎంపీడీవో లక్ష్మీకుమారి ప్రారంభించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రామకృష్ణ, పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళిక అనే అంశంపై మూడు రోజుల పాటూ జరగనున్న శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ముందుగా జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, గ్రామాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు స్థానిక నాయకులతో కలిసి గ్రామాల అభివృద్ధి ప్రణాళిక తయారు చేయాలన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, అందుకు అవసరమైన నిధులు, సంబంధిత పనుల పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన విధి విధానాలను ఆయన వివరించారు.



రొంపిచర్లలో నేతల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎండీవో, సర్పంచ్‌లు, కార్యదర్శులు

ప్రజా సహకారంతోనే స్వచ్ఛ నరసరావుపేట

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట: ప్రజల సహకారంతోనే పట్టణాన్ని స్వచ్ఛ నరసరావుపేటగా తీర్చిదిద్దుకోగలమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని 25, 33 వార్డుల్లో స్వయంగా పాల్గొని కాల్వల్లో పార ద్వారా పూడిక తొలగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ ఈ పారిశుద్ధ్య వారోత్సవాల్లో ప్రతి వార్డులను పూర్తిస్థాయిలో కాలువల్లో పూడిక తీయటం, పిచ్చిమొక్కలు తొలగించడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి బిల్డింగ్ మెటీరియల్స్ దిబ్బలు తొలగించడం, ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్ ద్వారా పూర్తిస్థాయిలో పరిశుభ్రం చేయడం జరుగుతుందన్నారు. కావున పట్టణ ప్రజలందరూ తమవంతు భాగంగా తమ చుట్టూ ఉండే పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వార్డు సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.



సైడు కాలువల్లో పూడిక తీస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం

స్థానిక ఆర్టీసీ డిపోకు కేటాయించిన సెమీ లగ్జరీ బస్సును సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. దీనిని హైదరాబాదు వెళ్లేందుకు ఉపయోగిస్తామని డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి పేర్కొన్నారు. కార్యక్రమంలో పూదోట రాయన్న, మాజీ కౌన్సిలర్ బాబు, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి చేయాలి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు



హాజరైన విద్యార్థులు

స్వచ్ఛంద సేవా సంస్థల పిలుపు

నరసరావుపేట ఈస్ట్: ఎయిడ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు. కేంద్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి నేతృత్వంలో రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్‌పై ప్రజలను చైతన్యపరిచేందుకు చేపట్టిన 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా సోమవారం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పీఎన్‌సీ అండ్ కె.ఆర్.కళాశాల ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ, మీకు తెలుసా కార్యక్రమం 8 వారాల పాటు 8 అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. హెచ్ఐవీ ఎయిడ్, సుఖవ్యాధుల పట్ల అవగాహన కల్పించటం ద్వారా అధిక శాతం ప్రజలు రక్తపరీక్షలు చేయించుకునేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎయిడ్స్ నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో టీఐ ఎన్జీఓ సంస్థ హాండ్స్ ఆఫ్ కంపాషన్ పీడీ ఆనంద్ బెంజిమన్, టీఐ ప్రోగ్రామ్ మేనేజర్ ఉదయరాజు, పీపీటీసీటీ కౌన్సిలర్ జ్యోతి, ఎస్టీఐ కౌన్సిలర్ వనజాక్షి, సీఎస్‌సీ ప్రతినిధి షేక్.మహమ్మద్ గౌస్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుజికల్పన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కుమారి పాల్గొన్నారు.

సమాయత్తం



నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్) ప్రతిభ పరీక్షలకు శావల్యాపురం విద్యార్థులు సమాయత్తమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో నిర్వహించే ప్రతిభ పరీక్షలు అర్హత సాధించిన విద్యార్థులకు ఒక్కో సంవత్సరం రూ.12 వేల చొప్పున తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు అర్హత సాధించిన విద్యార్థి బ్యాంకు ఖాతాలో నగదు జమ చేయనుంది. ఈ ప్రతిభ పరీక్షలు 8వ తరగతి విద్యార్థులు రాయడానికి అర్హులు కాగా పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు ఓసీ, బీసీ రూ.100 రూపాయలు, ఎస్సీ,ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. సెప్టెంబరు 6వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరణతో ఫీజు చెల్లింపునకు తుది గడువని, డిసెంబరు 8న పరీక్షలు జరుగుతాయని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి వెల్లడించారు. గతేడాది 9 మంది విద్యార్థులు ప్రతిభ పరీక్షల్లో అర్హత సాధించారని వివరించారు.

–శావల్యాపురం

నేడు దొండపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్: డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ మంగళవారం దొండపాడు గ్రామ సచివాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు డాక్టర్ ఎంవీ రామలింగారెడ్డి సోమవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి జరిగే వైద్యశిబిరంలో కంటి సంబంధిత వ్యాధులతో బాధపడేవారు పాల్గొని చికిత్స పొందాలని తెలిపారు. ఆరోగ్యశ్రీ, హెల్త్‌కార్డు ఉన్న వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేస్తారని తెలిపారు.

మహిళలూ.. రక్తహీనత బారిన పడకండి




చిలకలూరిపేట: మహిళలు రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని కేజే ఆసుపత్రిలో రక్తహీనత పై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత బారిన పడకుండా ప్రతిరోజూ పౌష్టికాహారం, అవసరమైనప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా 60 మంది మహిళలకు రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్ హిమబిందు, డాక్టర్ త్రిష నైనిక, డాక్టర్ శ్రియ, ఒయాసిస్ సభ్యులు కరణం విజయ, కోలా విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్ హైవేపై జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. విప్పర్ల సెంటర్‌లో నందిగం ప్రభుదాసు రోడ్డు దాటుతుండగా అదే మార్గంలో వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రభుదాసు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన ప్రభుదాసు మండలంలోని కొత్తపల్లి గ్రామవాసి. క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేటు అసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



శారద (ఫైల్)

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పల్నాడు జిల్లా, నరసరావుపేట మండలం కోటప్పకొండ గ్రామానికి చెందిన తన్నీరు శారద (62) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కాకానిలోని చర్చికి వెళ్లేందుకు ఈ నెల 10న అదే గ్రామానికి చెందిన కేశనబోయిన వెంకటేశ్వర్లుతో కలిసి మోటార్ సైకిల్‌పై బయలుదేరింది. ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడు కాటూరి హాస్పిటల్ సమీపంలో కుక్క ఒక్కసారిగా ద్విచక్ర వాహనానికి అడ్డు వచ్చింది. వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో శారదా వాహనంపై నుంచి కింద పడింది. తలకు తీవ్ర గాయాలవడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున వృద్ధురాలు మృతి చెందింది. ఈ మేరకు మృతురాలి కుమారుడు తన్నీరు శ్రీను అలియాస్ భవాని సిద్ధయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేశారు.

భూసమస్యలపై రెవెన్యూ గ్రామసభలు

తహసీల్దార్ జెట్టి విజయశ్రీ



యడ్లపాడు: వివిధ రకాల భూ సమస్యలపై గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు భూ సంబంధితమైన అన్ని రకాల సమస్యల్ని క్షేత్రస్థాయిలో కనుగొని వాటిని పరిష్కరించేందుకు ఈ గ్రామసభలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా నిషేధిత భూములు, చుక్కల భూముల, నోషనల్ ఖాతాలు రెగ్యులర్ మార్పుట, అసైన్డ్ భూములు, అలినేటెడ్ భూముల ఖాతా నంబర్లకు ఆధార్ నంబర్ నమోదు వంటి వివిధ రెవెన్యూపరమైన అన్ని సమస్యలకు పరిష్కారం చూపేందుకు ఈ సదస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ గ్రామసభలలో తహసీల్దార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల, గ్రామ సర్వేయర్, ఆయా గ్రామాలకు చెందిన వీఆర్వోలు హాజరుకానున్నట్లు వివరించారు. ప్రజలు రెవెన్యూ సదస్సులకు విధిగా హాజరై ఆయా సమస్యలను పరిష్కరించుకోవల్సిందిగా కోరారు.

గ్రామసభల షెడ్యూల్

16వ తేదీన కొండవీడు, 20న చెంఘీజ్‌ఖాన్‌పేట–కోట, 22న మైదవోలు, లింగారావుపాలెం, 27న సొలస, 29న తిమ్మాపురం, సెప్టెంబర్ 3వ తేదీన ఉన్నవ, 5న మర్రిపాలెం, 10న వంకాయలపాడు–బోయపాలెం –ఉప్పరపాలెం, 12న కారుచోల, 17న సందెపూడి, 19న తుర్లపాడు, 24న జాలాది, 26న యడ్లపాడు రెవెన్యూ గ్రామంతో ముగుస్తుంది. మైదవోలులో ఉదయం 10 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు లింగారావుపాలెం గ్రామసభ నిర్వహిస్తారు. మిగిలిన అన్ని గ్రామాల్లోనూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయా గ్రామ సచివాలయాల వద్ద గ్రామసభలు నిర్వహిస్తారు.

సబ్సిడీపై రైతులకు విత్తనాల పంపిణీ

ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

ఈపూరు: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను కూటమి ప్రభుత్వం సకాలంలో అందజేస్తుందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొచ్చర్ల గ్రామంలో రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొని రైతులకు విత్తనాలను అందజేసి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలని, రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఆయా రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన రైతులు మీ దగ్గరలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలు అందజేస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కౌలు రైతులకు కౌలురైతు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రవిబాబు, ఏవో రామారావు, ఎంపీడీవో ఎ.వి.రంగనాయకులు, తహసీల్దార్ నళిని, ఏఈవో బి.అప్పారావు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

ఎంఏఎం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు



నరసరావుపేట రూరల్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎంఏఎం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రసాదరావు తెలిపారు. కళాశాలలో సోమవారం నషాముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రసాదరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యసనం దేశంలో తీవ్ర ఆందోళన కలిగిస్తుందన్నారు. డ్రగ్ దుర్వినియోగం నేరాల రేటు పెరుగుదలకు దారి తీస్తుందని వివరించారు. దేశ అభివృద్ధిలో యువత శక్తి ముఖ్యమని, డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో గరిష్ట సంఖ్యలో యువత చేరడం చాలా ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత దేశాన్ని స్థాపించాలి

నరసరావుపేట రూరల్: డ్రగ్స్ రహిత భారతదేశాన్ని స్థాపించడంలో విద్యార్థులు తమవంతు కృషి చేయాలని ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్.మల్లికార్జున తెలిపారు. ఏఎం రెడ్డి విద్యాసంస్థల్లో సోమవారం డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు. మాదక ద్రవ్యాల బారినపడి యువత వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటికి యువత దూరంగా ఉండాలని సూచించారు. అందరితో స్నేహంగా మెలగాలని, ర్యాగింగ్‌కు పాల్పడవద్దని తెలిపారు. డిప్లమో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్‌రావు, విభాగాధిపతులు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

హక్కుల గురించి బాలికలు తెలుసుకోవాలి

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి

చిలకలూరిపేట: బాలికలు తమ హక్కుల గురించి తెలుసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.నరేంద్రరెడ్డి చెప్పారు. మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగంలోని 21–ఏ ఆర్టికల్ ఆరు నుంచి 14 సంవత్సరాల వయసుగల పిల్లలందరికీ ఉచిత విద్యాహక్కు ప్రసాదించిందని తెలిపారు. ఉచిత నిర్బంధ విద్య 2009 రాజ్యాంగ సవరణ ద్వారా అమలులోకి వచ్చిందని వివరించారు. విద్యార్థులకు ఏదైనా సమస్యలు ఉంటే మండల న్యాయసేవాధికార సంస్థకు పోస్టు కార్డు ద్వారా ఉత్తరం రాయవచ్చని చెప్పారు. మండల న్యాయసేవాధికార సంస్థ అలాంటి విద్యార్థులకు సహాయం అందజేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పోతుల వెంకట్, జీవీహెచ్ఎస్ ప్రసాద్, విద్యాలయ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి

చక్కగా చదువుకుని జీవితంలో రాణించాలి

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత నిర్బంధ విద్య అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా చిలకలూరిపేట మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె. నరేంద్రరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలన్నారు. ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగం కావాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు జి.వి.హెచ్.ఎస్.ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, ఆర్.ఆనందరావు, ఎం.భానుప్రసాద్, డి రాజేష్, నాదెండ్ల ఎస్సై జి.పుల్లారావు, స్కూలు ఎస్వో మాధవీలత పాల్గొన్నారు.

రాజనీతిశాస్త్ర అధ్యాపకురాలు ఝాన్సీరాణి మృతి



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో గత 35 సంవత్సరాలుగా రాజనీతిశాస్త్రం విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ జవ్వాజి ఝాన్సీరాణి సోమవారం మృతి చెందారు. గత పది రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. డాక్టర్ ఝాన్సీరాణి ఆకస్మిక మృతి పట్ల కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, ఆక్టా రాష్ట్ర అధ్యక్షుడు కోండ్రు మోహన రావు, పబ్లికేషన్ సెక్రటరీ డాక్టర్ ఐ.సదాశివరెడ్డి, అన్‌ఎయిడెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మేజర్ బీఎస్ఆర్‌కె రాజు, పీఎన్‌సీ అండ్ కెఆర్ కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వి.రావు, అధ్యాపకులు సంతాపం తెలిపారు.